# అనామిక మరణం

ఆఫీసుకు లేటయింది అనుకుంటూ ఇంట్లోనుంచి బయటకు అడుగుపెట్టాను. గబాగబా నాలుగు అడుగుల్లో రోడ్డు చేరుకున్నాను. విపరీతమైన రష్ రోడ్డంతా. ఎక్కడి వాహనాలు అక్కడే ఆగిపోయి ఉన్నాయి.

"ఏమయ్యింది ట్రాఫిక్ ఎందుకు జామ్ అయింది" పక్కన నిలబడ్డ వ్యక్తిని ప్రశ్నించాను.

'టీ.వి. స్టూడియో ముందు యాక్సిడెంట్ అయ్యింది'

'అయ్యో! ఏమైనా అయిందా' అడిగాను మళ్ళీ

"ఎవరో కాలేజీ అమ్మాయి రోడ్డు దాటుతుంటే రాంగ్‌సైడ్‌లో వచ్చిన లారీ గుద్దింది. మనిషి అక్కడికక్కడే చనిపోయింది" చెప్పాడతను

'డ్రైవర్‌ని పట్టుకున్నారా' అడిగాను

'లేదు పారిపోయాడు'

. మా ఏరియా కాబట్టి తెలిసిన అమ్మాయి అయి ఉండవచ్చునేమో అనే కుతూహలంతో చూడటానికి వెళ్ళాను. ఆఫీసుకు లేటవుతుంది అనే అసహనం పోయి, కుతూహలం వచ్చింది. అప్పటికే యాక్సిడెంట్ జరిగి ఒక అర్ధగంట అయిందనుకుంటా పోలీసులు వచ్చి అన్ని వివరాలు నోట్ చేసుకుంటున్నారు. మరోవైపు కొంతమంది పోలీసులు ట్రాఫిక్ డైవర్ట్ చేస్తున్నారు.

రోడ్డు మధ్యలో పడివున్న బాడీవైపు చూశాను. 22 సంవత్సరాల అమ్మాయి. చూడటానికి చాలా చక్కగా ఉంది. అయ్యోపాపం అమ్మాయి ఎవరో, ఎంటో దిక్కులేకుండా పడి ఉంది. అనిపించింది. పోలీసులు వివరాలు నోటు చేసుకోవడం అయిపోయినట్టుంది. ఆటో ట్రాలీ తెప్పించి బాడీని అందులోకి ఎక్కించడానికి సిద్ధమయ్యారు. ఇద్దరు పోలీసులు ఎవరైనా సహాయం చేస్తారేమో అని దిక్కులు చూశారు. చుట్టూ వందల సంఖ్యలో జనం గుమ్మికూడినా ఒక్కళ్ళు కూడా ముందుకు రాలేదు.

నేను ఓ చెయ్యివేసి బాడీని ట్రాలీ ఎక్కించడానికి సహాయం చేద్దామనిపించింది. కానీ ఆఫీసుకెళ్ళాలి బట్టలపై రక్తం పడుతుందేమోనని జంకి ఆ పని చేయలేదు. పోలీసులే ఎలాగోలా బాడీని ట్రాలీ ఎక్కించారు. బాడీని తీస్తుంటే రక్తం ఇంకా చుక్కలుగా కారుతూనే ఉంది. నేలంతా పరుచుకుంది. ట్రాలీలో ఒక పోలీసు ఎక్కి పోస్టుమార్టం కోసం ఉస్మానియా ఆస్పత్రికి తీసుకెళ్ళాడు.

మనసు ఒక్కసారి కలుక్కుమంది. ఎప్పుడూ అలాంటి సంఘటన చూడకపోవడంతో వాంతి వచ్చినట్లు అనిపించింది. మెదడు మొద్దు బారింది. ఆఫీసుకు ఆలస్యం అవుతుందన్న ధ్యాసే లేదు. నెమ్మదిగా రోడ్డు క్రాస్ చేసి చెట్టుకింద నిలబడ్డాను. మనసు నిండా ఆ అమ్మాయి ఆలోచనలే ముసురుకున్నాయి. తమ కూతురు కాలేజికి వెళ్ళిందనుకుంటున్న ఆ అమ్మాయి తల్లిదండ్రులకు ఈ విషయం తెలిస్తే ఎలా రోధిస్తారో.

ఆ అమ్మాయి కూడా జీవితం గురించి ఎన్ని కలలు కందో. రంగుల ప్రపంచాన్ని వెతుక్కుంటూ ఏ అమెరికానో, ఇంగ్లాండో వెళ్ళాలని అనుకొని ఉండొచ్చు లేదా పెళ్ళి చేసుకొని తాను, తన పిల్లలూ అంటూ ఏ స్వీట్‌హోమ్‌ను ఊహించుకొందో.

లారీ డ్రైవర్ నిర్లక్ష్యం ఒక్క క్షణంలో ఆ అమ్మాయి కలల్ని, జీవితాన్ని నడి రోడ్డుపై చిదిమి వేసింది.

ఇందులో తప్పెవరిది! రాంగ్‌సైడ్‌లో లారీ నడిపిన డ్రైవర్‌దా? లంచం తీసుకుని కాలం చెల్లిన లారీకి ఫిట్ సర్టిఫికెట్ ఇచ్చి రోడ్డుపైకి పంపిన ఆర్టీఏ దా? రాష్ డ్రైవర్ అని తెలిసి పనిలో పెట్టుకున్న లారీ ఓనర్‌దా? విశాలమైన రోడ్డుని తమ స్వలాభం కోసం కాంట్రాక్టు చేపట్టి డివైడర్ నిర్మించి ఇరుకుగా మార్చిన కాంట్రాక్టరుదా?

మళ్ళీ అనిపించింది. తప్పు ఎవరిదైతేనేం. ఒక నిండు జీవితం బలైంది. ఒక కుటుంబానికి జీవితాంతం కడుపుకోత మిగిలింది.


యాక్సిడెంట్ సరిగ్గా ఉప్పల్, అంబర్‌పేట్ పోలీసు స్టేషన్ సరిహద్దుపై జరిగింది. దీంతో రెండు స్టేషన్ల పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చారు. ఎవరి పరిధిలోకి కేసు వస్తుందో నిర్ణయించుకుని వెళ్ళిపోతున్నారు. నేను నిలబడ్డ చెట్టు దగ్గరకు ఒక ఖాకీ చొక్కా వేసుకున్న ఎస్సై వచ్చాడు.

'ఏరా ఇక్కడ నిలబడ్డావు' ప్రశ్నించాడు.

నేను తల ఎత్తి చూసి " ఓ నువ్వా బావా" అన్నాను

చాలా సేపయ్యింది నేను వచ్చి. ఆ అమ్మాయి గురించే ఆలోచిస్తున్నాను గానీ నువ్వు ఇక్కడ ఉన్న సంగతే చూడలేదు" అన్నాను.

గోవర్ధన్ కిరణ్ కుమార్



ఆ ఎస్సై నాకు చుట్టం. వరుసకు బావ అవుతాడు.

అంతసేపటి నుంచి అక్కడే ఉన్నా ఏం జరిగిందో పోలీసుల నుంచి తెలుసుకోవాలని- "ఎమైంది" ప్రశ్నించాను.

పూర్తి ఎంక్వైరీ చేయంది వాళ్ళకు మాత్రం వివరాలు ఏం తెలుసు.

అందుకే నాకు తెలిసిన సమాధానాన్నే మళ్ళీ చెప్పాడు.

"ఆ అమ్మాయి రోడ్డు క్రాస్ చేస్తుంటే, లారీ గుద్దింది" అన్నాడు.

నా పక్కన పార్కు చేసిన బండిని తీసి, 'ఎక్కడికి వెళ్తున్నావ్' అడిగాడు.

"ఆఫీసుకు"

అయితే బండెక్కు ఆ చౌరస్తాలో దింపుతా. అక్కడే బస్సు ఎక్కు అన్నాడు.

'పద' అంటూ స్కూటరెక్కి వెనక కూచున్నాను.

నాకు తెలిసిన విధంగా ప్రశ్నిస్తూ ఆ అమ్మాయి వివరాలు ఇంకా ఏమైనా తెలుస్తాయేమో అని చూస్తున్నాను.

కాని మా ఎస్సై బావ మాత్రం యాక్సిడెంట్‌ను చాలా ఈజీగా తీసుకున్నాడు. "కేసు నేను తీసుకుంటే ఓఐదువేలు మామూలుగా దొరుకుతాయి కానీ పని ఒత్తిడి ఎక్కువగా ఉంది అందుకే వాళ్ళకి ఇచ్చా" అంటూ పోలీసు పరిభాషలో మామూళ్ళ వ్యవహారాన్ని సులువుగా చెప్పేస్తున్నాడు.

ఓ నిండు జీవితానికి బాకీ కట్టిన వెల 5 వేలు

"మొన్న కారుకొన్నానురా. లక్షన్నర అయ్యింది. రేపు ఆదివారం ఇంటికిరా చూద్దువుగానీ" అన్నాడు. ఇంకా దారి పొడువునా ఏమో చెబుతున్నాడు.

నా మనసు మాత్రం ఆ అమ్మాయి చుట్టూ పరిభ్రమిస్తోంది. ఏ మాట వినబడటం లేదు.

చౌరస్తా రాగానే స్కూటర్ దిగి 'కలుస్తాను' అని చెప్పి వెళ్ళిపోయాను.

టైం చూసాను. అప్పటికే ఆఫీసుకు రెండు గంటలు ఆలస్యమైంది. అంబర్‌పేట్‌నుంచి బంజారా హిల్స్‌కి వెళ్ళడానికి ఈజీగా మరోగంట పడుతుంది ఈ రోజు ఆఫ్‌డే లీవ్ తప్పదు.

ఆఫీసుకు వెళ్ళి ఆఫ్‌డే లీవ్‌ఫామ్ ఇచ్చి, రిజిస్టర్‌లో సంతకం చేసి నేరుగా క్యాంటిన్‌కు వెళ్ళాను.

లంచ్ టోకెన్ ఇచ్చి, మీల్స్ తీసుకున్నాను. తిందామని కూచున్నా అన్నం అస్సలు సహించలేదు. అది తినకుంటే ఆ కాంక్రీట్ అరణ్యంలో మళ్ళీ ఏమీ దొరకదు. అందుకే ఓ నాలుగు ముద్దలు తిని చేయి కడుక్కున్నాను.

నేరుగా నా రూంలోకి వెళ్ళాను. వర్క్ మొదలు పెడదామని కంప్యూటర్ ముందు కూచున్నానుగానీ మైండ్ పనిచేయడం లేదు.

హైదరాబాద్‌కు వచ్చిన కొత్తలోని విషయాలే గుర్తుకు వచ్చాయి. ఎప్పుడో 90'లో డిగ్రీలో చేరడం కోసం నల్లగొండ నుంచి హైదరాబాద్ వచ్చాను. అప్పట్లో చిన్నచిన్న విషయాలకు కూడా విపరీతంగా స్పందించేవాడిని.

ఎవరైనా ముసలి వాళ్ళు, పిల్లలు బిచ్చం అడుక్కుంటుంటే కూడా చూసి తట్టుకోలేకపోయేవాడిని. జేబులో ఎంత ఉంటే అంత వేసేవాడిని. అయినా ఒక రోజంతా డల్‌గా అనిపించేది.

అంత చిన్న విషయానికి కూడా గాయమయ్యేంత సున్నితంగా ఉండేది మనసు.

ఓ పదేళ్ళుగా హైదరాబాద్‌లోనే ఉంటున్నాను. డిగ్రీ, పీజీ పూర్తి చేసి ప్రైవేటు కంపెనీలలో పని చేస్తూ సంపాదిస్తున్నాను. రాను రాను మనసు మొద్దుబారిపోయింది.

'ఒక్కోసారి ఆశ్చర్యమేసేది. నేనేనా అంత సున్నితంగా ఉంది అని'

'చదువు, నాగరికత మనిషిలోని మానవత్వాన్ని చంపేస్తుందేమో అని అనిపిస్తుంది. కాని ఇవ్వాళ చూసిన యాక్సిడెంట్ నన్ను మునుపటి మనిషిగా మార్చింది. యాక్సిడెంట్ చూసినప్పటి నుంచీ అదే కలిచివేస్తోంది. సాయంత్రం 5 అయింది. ఆఫీసులో ఒక్కొక్కళ్ళు వెళ్ళిపోవడానికి సిద్ధమవుతున్నారు.

నేనూ నా కంప్యూటర్ షట్‌డౌన్ చేసాను. ఏదో ఆఫీసుకు వచ్చాను కాబట్టి పని చేశాను అనిపించుకున్నాను. ఆ నెల వచ్చిన 15 రోజులైనా నెల జీతం ఇవ్వలేదనే విషయాలేమీ గుర్తుకు రాలేదు. వారం రోజులనుంచి ఏ బిల్లు ఎలా కట్టాలా అంటూ జుట్టుపీక్కున్న నాకు అప్పుడు జీతంచాలా చిన్న సమస్యగా అనిపించింది. ఏంటి అలా ఉన్నావు అంటూ కోలిగ్స్ ప్రశ్నించినప్పుడు యాక్సిడెంట్ విషయం చెప్పాను. వాళ్ళు ఓహో అలాగా అని ఊరుకున్నారు. విషయం విన్నా ఎవరిలోనూ పెద్దగా ప్రతిస్పందన కనిపించలేదు. 'మనం చూసిన విషయానికి, విన్న విషయానికి మధ్య స్పందనలో తేడా ఉండవచ్చుకాని ఒక వ్యక్తి మరణం అనే విషయాన్ని అంత సులువుగా ఎలా తీసుకుంటున్నారు' అనిపించింది.

యాక్సిడెంట్ ద్వారా వ్యక్తిని చంపి, ఒక ఉనికిని శాశ్వతంగా భూమి మీద నుంచి చెరిపివేసిన డ్రైవర్ లక్షణాలు వాళ్ళకు కూడా వస్తున్నాయా అనిపించింది.

'వీళ్లే ఇలా ఉంటే స్వలాభం కోసం నేరుగా మనిషిని హత్య చేసేవాళ్ళు ఏ ఆటవిక యుగానికి ప్రతినిధులో' ఆలోచనలు పెరిగిపోవడంతో తలవిదిల్చి చుట్టూ చూశాను.

ఇంతలో ఒక మిత్రుడు వచ్చి జీతం ఇస్తున్నారు, వెళ్ళు తీసుకో అని చెబుతున్నా నేను పట్టించుకోలేదు. అకౌంట్స్ వాళ్ళే బాయ్ చేత జీతం పంపితే తీసుకొని జేబులో పెట్టుకుని నేరుగా ఇంటికి వచ్చాను.

కొద్దిసేపు ఇంట్లో వాళ్ళతో మాట్లాడి కాళ్ళు, ముఖం కడుక్కుని భోజనం చేసి పడుకున్నాను.

గంటలు గడిచినా నిద్రలేదు. పొద్దుట దృశ్యాలే కళ్ళలో మెదులుతున్నాయి. అంత అశాంతిలోనూ కొంచెం ఆనందమేసింది. ఓ అనామిక మరణం నన్ను కలిచి వేసింది, కదిలించి వేసింది. అవును మళ్ళీ నేను మునుపటి మనిషిని అవుతున్నాను. ఆ మట్టి వాసన, స్పందన నాకు తెలుస్తున్నాయి.

. అయినా అసహనంగా నిద్రరాక పక్కపై దొర్లుతూనే ఉన్నాను.......